సిబ్బంది లేక ఇబ్బంది



చిత్తూరులోని ఎస్ఈ కార్యాలయం

● విద్యుత్ శాఖలో 551పోస్టులు ఖాళీ ● ఎస్ఈ కార్యాలయం ఏర్పాటైనా సిబ్బంది కేటాయింపులో నిర్లక్ష్యం
● ముందుకు సాగని అభివృద్ధి పనులు ● ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

పోస్టులు	మంజూరైనవి	ఖాళీలు
డీఈఈ	19	1
ఏఈఈ	59	11
జూనియర్ ఇంజనీరు	52	15
సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్	1	1
జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్	20	1
సీనియర్ అసిస్టెంట్	80	10
జూనియర్ అసిస్టెంట్	80	44
అటెండర్	30	10
రికార్డ్ అసిస్టెంట్	6	4
లైన్ ఇన్స్పెక్టర్	82	1
లైన్‌మెన్	292	4
లైన్‌మెన్ డ్రైవర్స్	10	6
అసిస్టెంట్ లైన్‌మెన్	271	209
జూనియర్ లైన్‌మెన్	245	209
జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2	304	17
స్వీపర్	13	2
వాచ్‌మెన్	18	6
మొత్తం	1582	551

చిత్తూరు రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత కారణంగా వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్ సరఫరా లేదని ఫిర్యాదు చేస్తే సిబ్బంది వచ్చి సరిచేసేపాటికి రోజుల సమయం పడుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే ఇక అంతే సంగతి. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు ఫ్యూజులు పోయాయని సమాచారం ఇచ్చినా సిబ్బంది రాకపోవడంతో రైతులే సొంతంగా మరమ్మతు చేయించుకుంటున్నారు. జిల్లాలో అన్ని క్యాడర్లు కలిపి 551 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గృహ, వాణిజ్య, పరిశ్రమల సర్వీసులు పెరుగుతున్నా అందుకు అనుగుణంగా నియామకాలు జరగడం లేదు.

ఇదీ పరిస్థితి..

నిబంధనల ప్రకారం ఏఈఈ 5 వేల సర్వీసులను పర్యవేక్షించాల్సి ఉండగా ప్రస్తుతం 9 నుంచి 10 వేల సర్వీసుల్ని చూస్తున్నారు. ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో రెండు సెక్షన్ల బాధ్యతలు ఒకరికే అప్పగించడంతో పాటు మరో సెక్షన్‌కు ఇన్‌చార్జిగా నియమించారు. ఒక లైన్‌మెన్ వెయ్యి సర్వీసులను చూసుకోవాల్సి ఉండగా 3 నుంచి 4 వేల వరకు పర్యవేక్షిస్తున్నారు. ఒక సబ్‌స్టేషన్ పరిధిలో ముగ్గురు లైన్‌మెన్ ఉండాల్సి ఉండగా ఒకరు కూడా లేని పరిస్థితి కొన్నింట్లో ఉంది.పంచాయతీకి ఒక లైన్‌మాన్ ఉండాల్సి ఉండగా 2, 3 పంచాయతీలకు ఒకరే ఉండటంతో గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు సకాలంలో పరిష్కారం కావడం లేదు. సిటిజన్ చార్ట్ ప్రకారం విద్యుత్ సరఫరా ఆగితే ఫిర్యాదు అందిన 4 గంటలలోపు సరఫరాను పునరుద్ధరించాలి. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైతే పట్టణాల్లో 12, గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటల్లోపు మార్పు చేసి సరఫరా ఇవ్వాల్సి ఉంది. ఈ దిశగా చర్యలు తీసుకోవటం లేదు. ట్రాన్స్‌ఫార్మరు కాలిపోతే రోజుల తరబడి మార్చడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేటాయించింది 39... చేరింది 8 మందే

జిల్లా విభజన జరిగిన తర్వాత చిత్తూరు జిల్లాలో ఎస్ఈ కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏడాది దాటుతున్నా.. ఎస్ఈ కార్యాలయం పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. నూతన ఎస్ఈ కార్యాలయానికి 39మంది సిబ్బందిని కేటాయిస్తే చేరింది కేవలం 8 మందే. మిగిలి వారు ఎక్కడ పనిచేస్తున్నారనే విషయంపై ఉన్నతాధికారులకు కూడా క్లారిటీ లేకపోవడం విశేషం. ఎస్ఈ కార్యాలయానికి జేఏవోలు ఐదుగురిని, సీనియర్ అసిస్టెంట్లు 11మందిని, జూనియర్ అసిస్టెంట్లు 9మందిని, ఎస్‌సీజీ నలుగురిని, ఓఎస్‌ఓ ఏడుగురిని, వాచ్‌మెన్లు ముగ్గురిని కేటాయించారు.అయితే వారిలో జేఏవోలు ముగ్గురు, సీనియర్ అసిస్టెంటు ఒకరు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు మాత్రం విధుల్లో చేరగా మిగిలిన 31 మంది ఎక్కడ పనిచేస్తున్నారో అధికారులకు కూడా తెలియని పరిస్థితి. కార్యాలయం ఏర్పాటై సంవత్సరం అవుతున్నా ఇప్పటి వరకు విధుల్లో చేరలేదని చిత్తూరు ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. దీంతో వారి పనుల భారం కూడా ఉన్నవారే మోయాల్సి వస్తోందని ఎస్ఈ వివరించారు.

17 కీలక పోస్టులు ఖాళీ

జిల్లాలో డీఈఈ ఒకటి, 11 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 15 జూనియర్ ఇంజనీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈఈ, టెక్నికల్ ఏఈఈ (ఎంఆర్‌టీ), టెక్నికల్ ఏఈఈ(కన్‌స్ట్రక్షన్స్),సంతపేట, చిత్తూరు రూరల్, ఐరాల అపరేషన్స్, ఐరాల రూరల్, అవులకొండ ఆపరేషన్స్, పెనుమూరు ఆపరేషన్స్, పలమనేరు ఆపరేషన్స్, వి.కోట ఆపరేషన్స్, కుప్పం అపరేషన్స్ ఏఈఈ పోస్టులు ఖాళీగా వున్నాయి. ఈ పోస్టుల్లో సబ్ ఇంజనీర్లు ఇన్‌చార్జ్ ఏఈఈలుగా వ్యవహరిస్తున్నారు. అలాగే చిత్తూరు ఎప్పీఎం, కొంగారెడ్డిపల్లి, మిట్టూరు, ఐరాల రూరల్, బంగారుపాళ్యం రూరల్, పాలసముద్రం ఆపరేషన్స్, కార్వేటినగరం ఆపరేషన్స్, వెదురుకుప్పం ఆపరేషన్స్, పుంగనూరు డివిజన్ కార్యాలయం. పుంగనూరు కమర్షియల్, వి.కోట ఆపరేషన్స్, పెద్దపంజాణి, సదుం ఆపరేషన్స్, సోమల ఆపరేషన్స్ జూనియర్ ఇంజనీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.




విధుల్లో చేరని సిబ్బందికి నోటీసులు

చిత్తూరు ఎస్ఈ కార్యాలయానికి కేటాయించిన సిబ్బందిలో 90 శాతం మంది ఇంకా చేరలేదు. ముగ్గురు చేయాల్సిన పనులను ఒక్కరే చేస్తుండడంతో సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. తిరుపతి నుంచి చిత్తూరు రావాల్సిన సిబ్బంది రాకపోవడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశాం.

- ఇస్మాయిల్ అహ్మద్,ఎస్ఈ

జాబిలిపై చల్లని తల్లి



● చంద్రప్రభ వాహనంపై భక్తులను కటాక్షించిన పద్మావతీ దేవి ● ఉదయం సూర్యప్రభపై వెలుగులీనిన అమ్మవారు

తిరుచానూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతీ దేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారు చంద్రప్రభ వాహనంపై వెన్నముద్దకృష్ణుడి అలంకరణలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు ఉత్సవమూర్తిని వాహన మండపానికి తీసుకొచ్చి ఆభరణాలు, పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలలతో అలంకరించి, అధిష్ఠింపజేశారు. గజ, తురగ, అశ్వాలు ముందుకు సాగుతుండగా జీయ్యర్ స్వాములు దివ్యవ ప్రబంధ పారాయణం, మంగళవాయిద్యం, చిన్నారుల కోలాటం, భజన బృందం కళాకారుల నృత్య ప్రదర్శన, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఊరేగింపు సాగింది. ఉదయం సూర్యప్రభ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని వేంచేపుగా వాహన మండపానికి తీసుకొచ్చారు. యోగనారాయణుడి సూర్యప్రభ వాహనంపై పద్మావతీ అమ్మవారు భక్తులను కటాక్షించారు. తిరుమాడవీధుల్లో సూర్యప్రభ వాహనసేవ అత్యంత వేడుకగా సాగింది. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తికి కేటీ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. జియ్యర్ స్వాములు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ మూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

● నేటితో ముగియనున్న వాహన సేవలు

పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న చిన్నశేష వాహనంతో ప్రారంభమైన వాహన సేవలు సోమవారం రాత్రి అశ్వ వాహనంతో ముగుస్తాయి. తొమ్మిది రోజుల్లో 16 వాహనాలపై అమ్మవారు ఊరేగి భక్తులను కటాక్షించారు.

రేపటితో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

మంగళవారం జరిగే పంచమి తీర్థంతో అమ్మవారి కార్తీక వార్షిక బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. అదే రోజు తిరుమల నుంచి అమ్మవారికి శ్రీవారి సారె రానుంది.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 9.15 గంటలకు రథోత్సవం
సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ
రాత్రి 7 గంటలకు అశ్వ వాహనం

తిరుమలేశుడి సేవలో నటి నిక్కీ



సినీ నటి నిక్కీ గల్రానీ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపలకు వచ్చిన నిక్కీని చూసేందుకు సినీ అభిమానులు ఉత్సాహం చూపారు. ఫొటోలు తీసుకున్నారు. నిక్కీ ధరించిన ఆభరణాలను పలువురు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం జరిగే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని కోరారు. అదేవిధంగా డివిజన్, మండల స్థాయిల్లో అధికారులు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతికి చేరుకున్న సిట్ బృందం

● నేటి నుంచి పరకామణి కేసు పునఃవిచారణ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : తిరుమల పరకామణి కేసు వారం రోజుల విరామం అనంతరం సోమవారం నుంచి పునఃవిచారణ ప్రారంభం కానుంది. సీఐడీ సిట్ బృందం ఆదివారం తిరుపతికి చేరుకుంది. పద్మావతి అతిథిగృహంలో పరకామణి చోరీ కేసులో తదనంతర పరిణామాలపై విచారణ మొదలుకానుంది. నిందితుడు రవికుమార్‌తో పనిచేసిన సిబ్బందితోపాటు కొంతమంది టీటీడీ పెద్దలను విచారించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. రూ.14 కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి ఇవ్వాలని ఎందుకు అనుకున్నారు? ఎవరు ఆదేశించారు? అనే విచారణ కీలకంగా మారనుంది.

19మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో గడచిన 24గంటల్లో శ్రీరంగరాజపురం మండలం మినహా మిగిలిన 18 మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. మండలాలవారీగా శ్రీరంగరాజపురంలో 25.4, నింద్రలో 8.2, యాదమరిలో 7.4, పులిచెర్లలో 6.4, పలమనేరులో 6, విజయపురంలో 5.2, నగరిలో 4.6, వి.కోటలో 4.2, బంగారుపాళ్యంలో 4, చిత్తూరు అర్బన్‌లో 3.2, సోమల, చిత్తూరు రూరల్ మండలాల్లో 2.6, గంగవరం, బైరెడ్డిపల్లె మండలాల్లో 2.4, రొంపిచెర్లలో 2, తవణంపల్లె, గుడిపాల మండలాల్లో 1.4, సదుం, శాంతిపురం మండలాల్లో 1.2 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

టైమ్స్ ర్యాంకింగ్స్‌లో ఎస్వీ వర్శిటీకి చోటు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో ఎస్వీ యూనివర్సిటీకి చోటు దక్కింది. ఇంటర్ డిసిప్లినరీ సైన్స్ ర్యాంకింగ్స్‌లో 601-800 మధ్య ర్యాంకు సాధించింది. తద్వారా యూనివర్సిటీ ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనల్లో ప్రపంచ స్థాయిలో ప్రత్యేకతను చాటుకుంది. మన దేశం నుంచి 88 విద్యా, పరిశోధన సంస్థలు ఈ పోటీలో పాల్గొనగా పరిశోధనల్లో నాణ్యత, ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలు, పర్యావరణ సంబంధ కృషిలో ఎస్వీయూ ప్రత్యేకతను నిరూపించుకుంది. ఎస్వీయూకు ర్యాంకు దక్కడం పట్ల వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు.

నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల వినియోగదారులు 8977716661కు ఫోన్‌చేసి సమస్యలను తెలియజేయాలని కోరారు. అలాగే విద్యుత్ శాఖ టోల్ ఫ్రీనంబర్లు 1912 లేదా 18004251553338లకు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు.



కాణిపాకం కిటకిట

ఆలయం వెలుపల వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది.సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు క్యూ కట్టడంతో ఆలయంలోని క్యూలైన్లు పూర్తిగా నిండి పోయి వెలుపల వందల సంఖ్యలో భక్తులు వేచి వుండాల్సివచ్చింది. శబరిమలకు బయల్దేరిన అయ్యప్ప స్వామి భక్తులు కూడా వరసిద్ధుని ఆలయానికి అధిక సంఖ్యలో విచ్చేశారు.దీంతో స్వామి దర్శనానికి నాలుగు గంటల పైనే సమయం పట్టింది.

సత్యసాయి స్ఫూర్తితో సేవాభావం అలవరుచుకోవాలి



బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా సేవలు విశ్వవ్యాప్తమని ప్రతి ఒక్కరూ వారి స్ఫూర్తితో సేవాభావం అలవరుచుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. ఆదివారం కలెక్ట రేట్‌లోని భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను బాబా భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. తొలుత సాయిబాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ సాయిబాబా జయంతిని ప్రభుత్వం పండగగా నిర్వహి స్తోంద న్నారు. సాయిబాబా తన సేవలతో మారుమూల గ్రామమైన పుట్టపర్తికి ప్రపంచస్థాయి గుర్తింపును తీసుకొచ్చారని చెప్పారు. రాయలసీమ ప్రజ ల దాహార్తిని తీర్చిన మానవతా మూర్తిగా ప్రజల గుండెల్లో చిరస్థా యిగా నిలిచిపోయారన్నారు. పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అం దించి ప్రజల మనస్సుల్లో దేవుడిగా నిలిచిపోయారన్నారు. సాయిబాబా ట్రస్టు ద్వారా నేటికీ అనేక గ్రామాల్లో ఉచిత తాగునీటి వసతి, విద్య, వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. బాబాను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజానికి తమవంతు సేవ చేసేందుకు ముందుకురా వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డీఆర్వో మోహన్‌కుమార్, బాబా భక్తులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన ముఖ్యం



చెకుముకి పోటీల్లో విజేతలను ప్రశంసిస్తున్న ప్రముఖులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన ఎంతో ముఖ్యమని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్కే ఇంటర్నేషనల్ స్కూల్లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు 8, 9, 10 తరగతుల్లో చదువుతున్న 171 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి పాఠశాల విద్యే పునాది అన్నారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం రవీంద్ర, కోమల, జేవీవీ జిల్లా అధ్యక్షుడు అరుణశివప్రసాద్, జయంతి, నాగేశ్వర్‌రావు, సుధాకర్, యుగంధర్‌బాబు, శ్రీధర్‌రెడ్డి, సుదర్శనాచారి, రమణ, మురళి, తులసి, మునిరత్నం, సురేంద్ర, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐఐటీ, సీఈఎంఎస్ ఎంవోయూ



ఎంవోయూలతో ఐఐటీ, సీఈఎంఎస్ ప్రతినిధులు

ఏర్పేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ, విశాఖ పట్నంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సు ఇన్ మారిటైమ్ అండ్ షిప్ బిల్డింగ్ మధ్య ఎంవోయూ కుదిరింది. సీఈఎంఎస్ సీఈవో గోపీకృష్ణ శివం, ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ఎంవోయూ పత్రాలను మార్చు కున్నారు. ఐఐటీ డైరెక్టర్ కే.ఎన్.సత్యనారాయణ, సీడీవో డీన్ అరుణ్ టంగిరాల మాట్లాడుతూ టెక్నాలజీ రంగాల్లో విద్యా-పరిశ్రమల భాగస్వా మ్యాన్ని బలోపేతం చేసే కీలక అడుగుగా ఈ ఎంవోయూ నిలిచింద న్నారు. భవిష్యత్తు టెక్నాలజీకి అవసరమైన నైపుణ్యాలతో విద్యార్థులను, సంస్థలను శక్తివంతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ సాయికృష్ణ, సీఈఎంఎస్ జీఎం సబ్యసాచి మజుందార్, ఇతర ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో స్మైలీ ఎకో ఇండస్ట్రీస్ ఉత్పత్తుల ప్రారంభం



ఉత్పత్తులను ప్రారంభిస్తున్న భువనేశ్వరి

సత్యవేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నాప్కిన్ తయారీ పరిశ్రమ స్మైలి ఎకో ఇండస్ట్రీస్ తమ ఉత్పత్తులను లాంచనంగా ప్రారంభించింది. కుప్పం పర్యటనలో ఉన్న సీఎం చంద్ర బాబు సతీమణి నారా భువ నేశ్వరి చేతుల మీదుగా శని వారం సంస్థ ఎండీ పరుచూరి మల్లికార్జున్ ప్రారంభించారు. మహిళలకు నెలసరిలో అవసర మయ్యే 10 వేల నాప్కిన్స్‌ను ఎన్టీఆర్ ట్రస్టుకు ఈ సందర్భంగా వితరణ చేసినట్లు ఆయన తెలిపారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించి దీప ధూప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

● 'ఆయన' అడిగారని

కుప్పంపై భువనేశ్వరి ప్రేమ!

● నాలుగు రోజుల పర్యటనలో అదే స్థాయిలో ప్రజాభిమానం

కుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'కుప్పాన్ని నువ్వు చూసుకుంటావా అన్నారు. అక్కడికి వెళ్లి ప్రజలను పలకరించి, వారి కష్టసుఖాలు తెలుసుకుని నాకు చెబుతావా? అన్నారు. ఆయన అడిగారని నేను మీ దగ్గరకు ఇలా తరచూ వస్తున్నాను.' - ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్న మాటలివి.

భువనేశ్వరి తరచూ కుప్పం ఎందుకు వస్తున్నారు? ఆమెకేమైనా రాజకీయాలపై ఆసక్తి కలిగిందా? లేక ఇక్కడినుంచి పోటీ చేయాలన్న ఆలోచన ఏదైనా ఉందా? అన్న అనుమానాలు, ప్రశ్నలకు ఆమెనుంచి లభించిన సమాధానమిది.అవును.. భర్త చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పానికి భువనేశ్వరి ప్రతి మూడునాలుగు నెలలకోసారి వస్తున్నారు. ఇక్కడి ప్రజలను పలకరించి, ముఖ్యంగా మహిళలను ముఖాముఖి కలిసి, వారి వెన్ను తట్టి వెళ్తున్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలను మరింతగా విస్తరిస్తున్నారు. ఆపన్నులకు సాయం అందిస్తున్నారు. సాధ్యమైనంత వరకు రాజకీయాసక్తులకు దూరంగా ఉంటున్నారు. ఈసారి కూడా భువనేశ్వరి, ఈనెల 19, 20, 21, 22 తేదీలలో కుప్పం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. 23వ తేదీన అంటే ఆదివారం మధ్యాహ్నం 12 గంటలదాకా శాంతిపురం మండలం కడపల్లెలోని స్వగృహంలో ఆత్మీయులతో గడిపారు. 'ఆయనకు మిమ్మల్ని కలవడానికి టైం దొరకడంలేదు. మీకు తెలుసు కదా, అందుకనే తన బదులు నన్ను వెళ్లమన్నారు. ఆయనకోసం, ఆయనకు 8 సార్లు ఘన విజయం అందించిన మీకోసం నేను కుప్పం వస్తున్నా' అని స్పష్టంగా పేర్కొని, తరచూ తన పర్యటనపై కొంతమందికి ఉన్న ఏవేవో అనుమానాలను ఈసారి భువనేశ్వరి పటాపంచలు చేశారు. నిజానికి కొంతమంది టీడీపీ కార్యకర్తల్లో కూడా ఆమె కుప్పం పర్యటనలపై ఏవేవో ప్రశ్నలు మెదలడం అబద్ధం కాదు. ఇప్పుడా ప్రశ్నలు, అనుమానాలు అందరికీ తీరిపోయాయి.

రాజకీయాలకు దూరంగా

కుప్పంలో భువనేశ్వరి నాలుగు రోజుల పర్యటన రాజకీయాలకు దూరంగా సాగింది.ఒక్కో మండలంలో కనీసం రెండేసిచోట్ల మహిళలతో ముఖాముఖి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ద్రావిడ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో, ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పర్యటన ప్రాంతాల్లోని గుడులకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ శిక్షణ తీసుకుని, ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన యువతతో సమావేశమయ్యారు. మధ్యలో హంద్రీ-నీవా కాలువ ద్వారా చెరువులకు చేరిన కృష్ణా జలాలకు జలహారతులిచ్చారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా మహిళలకు, పేదలకు కుట్టు మిషన్లను, తోపుడు బళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. అంతేకాదు.. వెళ్లిన ప్రతిచోటా మహిళలను ఆత్మీయంగా పలకరించారు. ఒకటిరెండు చోట్ల మహిళలతో ముఖాముఖిలో పరోక్షంగా గత అయిదేళ్ల ప్రతిపక్ష పార్టీ పాలనపై పరోక్ష విమర్శలు చేశారు తప్ప మరెటువంటి రాజకీయపరమైన సంభాషణల జోలికి ఆమె పోలేదు. అదికూడా అప్పట్లో మహిళలపై జరిగిన దాడులు, దౌర్జన్యాలపై ఆవేదన మాత్రమే వెళ్లగక్కారు. ప్రజల సాదకబాధకాలు విని, చేతనైతే సాయం చేయడానికి మాత్రమే వచ్చిన భువనేశ్వరి నిబద్ధతకు నిదర్శనం ఇది. కాగా కుప్పం ప్రజలు, మరీ ముఖ్యంగా మహిళల్లో భువనేశ్వరికి ఎప్పటిలాగానే మంచి ఆదరణ లభించింది. ఆమె వెళ్లిన ప్రతిచోటా స్థానిక మహిళలు పూలహారాలు వేసి, మంగళ హారతులు ఇచ్చి సాదర స్వాగతం పలికారు. ఎన్టీఆర్ ట్రస్టు కార్యక్రమాలు,మరికొన్ని ఇతర గ్రామాలలో పాదాభివందనాలు చేయడానికి కూడా కొందరు ప్రయత్నించారు కానీ, ఆమె సున్నితంగా వారించారు. భువనేశ్వరితో కలిసి సెల్ఫీలు తీసుకోవడానికి మహిళలు, యువత ఎగబడ్డారు. ఆమె కూడా ఏమాత్రం విసుక్కోకుండా సెల్ఫీలు తీసుకోవడం తెలియని వారికి, తాను మొబైల్ పట్టి సాయం చేశారు. ఎక్కడా ఎటువంటి భేషజం లేకుండా నవ్వుతూ, అప్పుడప్పుడూ సున్నితమైన మాటలతో నవ్విస్తూ తమలో ఒకరిగా తిరిగిన భువనేశ్వరి, ఎల్లప్పుడూ కుప్పం ప్రజలకు రుణపడి వుంటానని చెప్పడం అన్నింటికంటే ఎక్కువగా నియోజకవర్గ ప్రజల అభిమానం చూరగొంది.



విజలాపురం పెద్దచెరువులో శుక్రవారం జలహారతి అనంతరం భువనేశ్వరితో కరచాలనాలకు పోటీ పడుతున్న జనం



- భువనేశ్వరికి ఆదివారం మధ్యాహ్నం ప్రజల వీడ్కోలు

అన్నదాతలకు మరింత చేరువగా

పథకాలు...ప్రయోజనాలు

● నేడు రైతన్నా మీకోసం ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలపై రైతులకు మరింత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని నేటినుంచి నిర్వహిస్తోంది.రైతు సేవా కేంద్రాల వారీగా ప్రజాప్రతినిధులతో కలిసి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది శనివారం వరకు రైతులను ఇండ్లకు వెళ్లి కలవనున్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ప్రయోజనాలు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాసిన లేఖను అందించనున్నారు.పంచ సూత్రాలైన నీటి నిర్వహణ బాధ్యత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్‌తో పాటు ప్రభుత్వ మద్దతును వివరించనున్నారు. మారుతున్న ఆహార అలవాట్లకు అనుగుణంగా సాగు పద్ధతులను మార్చుకోవాలని తెలియజేయనున్నారు. పంటల మార్పిడితో పాటు రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రల సాగు ను పెంచాలని సూచించనున్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ద్వారా బిందు సేద్య విస్తరణతో పాటు నీటి వినియోగాన్ని 40 శాతం తగ్గించడంపై రైతులకు అవగాహన కలిగించనున్నారు. బిందు, తుంపర్ల సేద్యం యూనిట్లకు 90 నుంచి వంద శాతం రాయితీ ఇవ్వడం, టెక్నాలజీ వాడకంతో పెట్టుబడి తగ్గించడం, యంత్రాల సరఫరా, కిసాన్ డ్రోన్ సేవలు, పంటల ఆరోగ్య స్థితి అంచనా వేయడానికి శాటిలైట్ టెక్నాలజీ వాడకాన్ని వివరించనున్నారు.వీటితో పాటు పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు ద్వారా సంపద సృష్టికి చేపట్టాల్సిన అంశాలు వివరించనున్నారు.

తిరుపతిలో ప్రత్యేక సంస్కృత అకాడమి

● తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ విల్సన్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని, తిరుపతిలో ప్రత్యేకంగా సంస్కృత అకాడమీ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి.విల్సన్ (శరత్‌చంద్ర) పేర్కొన్నారు. తిరుపతిలోని తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి, విజయవాడలో తెలుగు, సంస్కృత అకాడమీ కార్యాలయాలు కొనసాగుతాయని, వాటిని తరలిస్తున్నారనే ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మవద్దని కోరారు. గతంలో నిలిచిపోయిన తెలుగు అకాడమీ జర్నల్‌ను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను తీసుకొస్తామని, 1 నుంచి 10వ తరగతి వరకూ పాఠ్య పుస్తకాల ప్రచురణ బాధ్యతను అకాడమీ చేపట్టే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. పాఠ్య పుస్తకాలను సొంతంగా ప్రచురించి, వ్యాపారం చేస్తున్న ప్రైవేటు కళాశాలలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు తెలుగులో చదవడం, మాట్లాడటం, రాయడం వంటి నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందించాలని భావిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర విభజన క్రమంలో ఏపీకి రావాల్సిన నిధులను రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ పరిధిలో చాలా ఏళ్లుగా పనిచేస్తున్న వారికి టైంస్కేల్ వర్తింపజేయాలని ఆలోచిస్తున్నామన్నారు. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అకాడమీ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని, అప్పట్లో చోటుచేసుకున్న అవినీతి అక్రమాలపై విచారణ చేపడతామని వెల్లడించారు.

పద్మావతి ఆస్పత్రి మెడికల్ షాపు మూత

స్విమ్స్‌లో పులివెందుల పెత్తనానికి బ్రేక్



మూతపడిన మెడికల్ షాపు

తిరుపతి , నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీపద్మావతి ఆస్పత్రి వద్ద నామమాత్రపు అద్దెతో గడువు తీరిపోయినప్పటికీ పొడిగింపుతో కొనసాగుతున్న వైసీపీ వర్గీయుల మెడికల్ షాపును టీటీడీ రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం మూసివేశారు. లాభాపేక్ష లేకుండా మెడికల్ షాపు నిర్వహించేలా టీటీడీ పాలకమండలి సమావేశంలో ఇటీవల నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో దీన్ని మూసివేశారు. దీంతో వైసీపీ హయాంలో స్విమ్స్ ఆస్పత్రిలో మొదలైన పులివెందుల పెత్తనానికి బ్రేక్ పడినట్లయింది.

● మాఫియాకు షాక్

స్విమ్స్‌లో పద్మావతి జనరిక్ మెడికల్ షాపుతో పాటు గడువు తీరిన డాక్టర్ క్యాంటీన్‌ను కూడా మూసివేయించారు. టీటీడీ తిరుపతి ఎస్టేట్ ఆఫీసర్ సువర్ణ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, స్థానిక పోలీసులు, విజిలెన్స్ సిబ్బంది స్విమ్స్‌కు చేరుకుని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటిపై చర్యలకు ఉపక్రమించారు. తొలుత స్విమ్స్ ఓపీ విభాగం వద్ద ఉండే షాపును రద్దు చేయగలిగారు గాని పులివెందుల చేతిలో ఉన్న పద్మావతి ఆస్పత్రి వద్ద ఉన్న మెడికల్ షాపును మాత్రం కదిలించలేకపోయారు. తొలుత కేవలం రూ.17వేల నామమాత్రపు అద్దెతోనే దీనిని కేటాయించి, ప్రస్తుతం రూ.60వేలకు పెంచారు.దాదాపు రూ.20లక్షల అద్దె అవకాశం ఉన్నప్పటికీ మాఫియా ఒత్తిళ్లతో కొనసాగిస్తూ వచ్చారు. దీనిపై మీడియాలో కథనాలు వచ్చిన నేపథ్యంలో టీటీడీ నాలుగు సార్లు టెండర్లు పిలిచింది. మెడికల్ మాఫియా రింగుగా మారి షాపులు పంచుకున్నారన్న ఆరోపణలున్నాయి. వీరు ఇంతకాలం కొనసాగడానికి రెవెన్యూ విభాగంలోని వైసీపీ వాసనలుపోని కొందరి ప్రమేయం ఉందన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ ఛైర్మన్ నిర్ణయంతో మెడికల్ మాఫియా షాక్‌కు గురైంది.

● టీటీడీ షాపునకు కసరత్తు

స్విమ్స్ యాజమాన్యమే మెడికల్ షాపును గతంలో నిర్వహించింది. 20 ఏళ్ల క్రితం పాత క్యాజువాల్టీ సమీపంలో మెడికల్ షాపును స్విమ్స్ ఆధీనంలోని సిబ్బందే నిర్వహించారు. ఆ తర్వాత రాజకీయ జోక్యం పెరగడంతో ప్రైవేట్ వ్యక్తులు పాగా వేశారు. తాజాగా ఛైర్మన్ నిర్ణయంతో మళ్లీ స్విమ్స్ చేతికి ఫార్మసీ పగ్గాలు అందనున్నాయి.

రేపటి పంచమి తీర్థానికి తిరుచానూరు సిద్ధం



కొత్త నీటితో కళకళలాడుతున్న పుష్కరిణి

తిరుచానూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం పంచమి తీర్థానికి టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది.మంగళవారం మధ్యాహ్నం 12.10 గంటలకు పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనుండడంతో పుష్కరిణిని కొత్తనీటితో నింపారు.లక్ష మంది భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేయడానికి ప్రత్యేకంగా 150 కౌంటర్లు ఏర్పాటు చేశారు. జేఈవో వీరబ్రహ్మం ఆదివారం తిరుచానూరులో ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింట్లను పరిశీలించారు. పంచమితీర్థం రోజున పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వేలాదిమంది భక్తులు తిరుచానూరు రానున్నారు. 20 వేల మంది ఒకసారి పద్మసరోవరంలో పుణ్యస్నానం ఆచరించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. తిరుచానూరు ముఖద్వారాల్లో టీటీడీ ప్రత్యేకంగా హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేసింది. ఆ పాయింట్ నుంచి పుష్కరిణి(కోనేరు) వరకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారానే పుష్కరిణిలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి వైపు నుంచి భక్తులకు నవజీవన్ ఆస్పత్రి వద్ద, వడమాలపేట, అప్పలాయగుంట, పూడి మార్గం నుంచి వచ్చే వారి కోసం తిరుచానూరు గోశాల(స్వర్ణముఖి నది ఒడ్డున) వద్ద ఏర్పాటు చేశారు. స్థానికులు, భక్తుల కోసం తిరుచానూరు జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. పూడి సర్కిల్ నుంచి ప్రత్యేక క్యూలైన్ ద్వారా టీటీడీ ఉద్యోగులు, మీడియా వారు పుష్కరిణిలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. హోల్డింగ్ పాయింట్లలో అన్న ప్రసాదాలు, పాలు, బిస్కెట్లు, ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు భక్తులను పుష్కరిణిలోకి అనుమతిస్తామని టీటీడీ అధికారులు తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా...తిరుచానూరులోకి సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు వాహనాలకు అనుమతి లేదని అడిషనల్ ఎస్పీ రవిమనోహచారి, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ తెలిపారు. చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను చెర్లోపల్లి వైపు మళ్లిస్తారు. చెన్నై, శ్రీకాళహస్తి నుంచి వచ్చే వాహనాలు గాజుల మండ్యం, రేణిగుంట, ఆటోనగర్ మీదుగా తిరుపతికి వెళ్లాల్సి ఉంటుంది. పూడి వైపు నుంచి వచ్చే వాహనాలను అప్పలాయగుంట రోడ్డులో మళ్లించనున్నారు. పూడి నుంచి వచ్చే వాహనాలకు ముండ్ల పూడి క్రాస్ వద్ద, తిరుపతి నుంచి వచ్చే వాహనాలకు మార్కెట్ యార్డు, శిల్పారామం వద్ద పార్కింగ్ కేటాయించారు. చంద్రగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను తాజ్‌హోటల్ రోడ్డులోని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాల్సి ఉంటుంది. రేణిగుంట నుంచి వచ్చే వాహనాలకు నారాయణాద్రి ఆస్పత్రి వద్ద పార్కింగ్ కేటాయించారు.

28 నుంచి తిరుమలలో షోడశదిన సుందరకాండ పారాయణం

తిరుమల, నవంబరు23(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం ఈ నెల 28 నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు తిరుమలలోని వసంతమండపంలో షోడశదిన సుందరకాండ పారాయణం నిర్వహించనున్నారు. 27వ తేదీ సాయంత్రం 7 నుంచి 8 గంటల మధ్య ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో అంకురార్పణ చేయనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంత మండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్ఠానం నిర్వహించనున్నారు. డిసెంబరు 13వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య వేదవిజ్ఞానపీఠంలో పూర్ణాహుతితో ఈ కార్యక్రమం పరిసమాప్తి అవుతుంది.

టిప్పర్ ఢీకొని వివాహిత మృతి



మృతి చెందిన వరలక్ష్మి

వి.కోట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఓ వివాహిత మృతిచెందిన సంఘటన వి.కోటలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు... బోయచిన్నాగనపల్లెకు చెందిన మోహన్ భార్య వరలక్ష్మి (28) వి.కోటలో బ్యూటీపార్లర్ నిర్వహిస్తోంది. వరలక్ష్మి ఆదివారం రాత్రి పార్లర్‌లో పనులు ముగించుకొని స్కూటీపై ఇంటికి బయలుదేరింది వి.కోట పట్టణం పలమనేరు రోడ్డులో చర్చి ఎదుట రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. సీఐ సోమశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయ న ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అంతకు ముందు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

తిరుమలలో వర్షం



పొగమంచులో శ్రీవారి ఆలయం

తిరుమల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో ఆదివారం విడతలవారీగా వర్షం కురిసింది. శనివారం నల్లటి మేఘాలు తిరుమలను కప్పేయగా, ఆదివారం వేకువజాము నుంచే చిరుజల్లులు మొదలయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు అప్పుడప్పుడు కురవగా, సాయంత్రం మాత్రం జోరు వర్షం కురిసింది.దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేసింది. చలితీవ్రత పెరిగింది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

వైభవంగా చౌడేశ్వరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విశేష అలంకరణలో చౌడేశ్వరమ్మ

రామకుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని మిట్టపల్లె పెద్దచెరువు సమీపంలో కొత్తగా నిర్మించిన చౌడేశ్వరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 4.30 గంటలకు వేదపండితులు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల మధ్య అమ్మవారి విగ్రహ ప్రాణప్రతిష్ఠ చేశారు. అనంతరం నేత్రోన్మీలనం, కళాహోమం, బలి, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంచిపెట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం చేశారు. మధ్యాహ్నం కర్ణాటక రాష్ట్రం మాలూరు పట్టణానికి చెందిన భాగవతారిణి జీవిత ఆలపించిన హరికథా కాలక్షేపం భక్తులను అలరించింది.

29 వరకు రైతన్నా-మీకోసం వారోత్సవాలు

గుడుపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు రైతన్నా మీకోసం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖల నుంచి అందించే పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం, రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, రాయితీపై డ్రిప్ పరికరాలు అందించడంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు.

నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పలమనేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు, ఉద్యోగులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గిరిధరగుప్తా డిమాండు చేశారు. ఆదివారం పలమనేరు సీఐటీయూ కార్యాలయం ఎదుట ఆయన నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్పొరేట్ సంస్థలకు చౌకగా శ్రమ శక్తిని అందించడం, ఫలితంగా వారు మరిన్ని ఆర్థిక లాభాలు గడించడమే లక్ష్యంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చిందని, జాతీయ కార్మిక సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికుల పనిగంటలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాజా, జయంతి, బిల్డింగ్ కార్మికుల సంఘ కార్యదర్శి అంజి, శ్రీరామయ్య, సుధాకర్, ధనమ్మ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి బాబా శత జయంతి



నివాళులర్పిస్తున్న కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి తదితరులు

పలమనేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం పుట్టపర్తి సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి మాట్లాడుతూ బాబా సేవలు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించాయన్నారు. సుమారు రూ.350 కోట్ల వ్యయంతో తాగునీటి సరఫరా చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్ కిరణ్‌కుమార్, కుమార్‌శెట్టి, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సభ్యులు నాగరాజు, మైనారిటీ పార్లమెంట్ అధ్యక్షులు ఖాజాపీర్, నాగమణి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శ్రీపురం సీతారామయ్య, పీపీఎస్ సభ్యులు నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

● **వి.కోట:** వి.కోట పట్టణంలోని సత్యసాయి పాఠశాలలో సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సత్యసాయి పాఠశాలలో సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో కేజీఎఫ్ బస్టాండు వద్ద పేదలకు అన్నదానం నిర్వహించారు. ఆయన చూపిన సేవా మార్గంలో అందరూ నడవాలని విశ్రాంత ఎంఈవో ఆర్ముగం అన్నారు. ఆయన పేరిట ప్రభుత్వాస్పత్రిలో పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు చంద్రశేఖర్, మురళీ, వికాస్, శ్యాంరెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలోని కళాతరంగిణి సంగీత, నృత్య శిక్షణ కేంద్రంలో ఆదివారం భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతజయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు నిర్వహించి చిన్నారులు భజనలు చేశారు. అనంతరం పలువురికి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక గేయాలు ఆలపించిన చిన్నారులకు సత్యసాయి భక్త మండలి నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులందజేశారు.

ఆర్టీసీ బస్టాండులో అనారోగ్యంతో వృద్ధుడి మృతి



మృతిచెందిన గురువారెడ్డి

పలమనేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఆర్టీసీ బస్టాండులో అనారోగ్యంతో బాధపడుతున్న గంగవరం మండలం డ్రైవర్స్ కాలనీకి చెందిన గురువారెడ్డి ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రచయిత బాలాజీకి సన్మానం



బాలాజీని సన్మానిస్తున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

పలమనేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రచయితగా సమాజసేవకు కృషి చేస్తున్న పెద్దపంజాణి ఎంపీడీవో పలమనేరు బాలాజీని ఆదివారం జన విజ్ఞాన వేదిక నాయకులు ఘనంగా సన్మానించారు. చిత్తూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల కార్యక్రమంలో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం, జనవిజ్ఞానవేదిక నాయకులు సుదర్శనాచారి, జయంతి, ఆర్కే మోడల్ స్కూల్ కరస్పాండెంట్ కోమల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి ఎన్జీవో సంఘంలో సభ్యత్వం తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీవో సంఘ పలమనేరు అధ్యక్షుడు ఆనందబాబు

పలమనేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగి ఎన్జీవో సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని పలమనేరు తాలూకా ఎన్జీవో సంఘ అధ్యక్షులు ఆనందబాబు పిలుపునిచ్చారు. ఆదివారం పలమనేరు ఎన్జీవో సంఘ భవనం వద్ద జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు తాలూకా పరిధిలో ఉన్న గెజిటెడ్ ఉద్యోగులు, నాన్‌గెజిటెడ్ ఉద్యోగులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఏపీఎన్జీవో సంఘంలో సభ్యులుగా చేరాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఉద్యోగుల హక్కుల సాధనపై ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ నాయకత్వంలో నిరంతరం పోరాటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జయమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతియాదవ్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి, జిల్లా అధ్యక్షులు రమణ, మోహన్, రాంప్రసాద్, శ్రీనివాసులు, బిందు, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గిరిజనులకు గృహనిర్మాణాల అప్పగింత



గృహప్రవేశం చేసి గిరిజనులకు ఇళ్లను అప్పగిస్తున్న టీడీపీ నాయకులు లక్ష్మీపతిరాజు

చౌడేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పీ4 దత్తత గృహాలకు టీడీపీ నాయకులు, పారిశ్రామిక వేత్త మాదిరాజు లక్ష్మీపతిరాజు గృహప్రవేశాలు శాస్త్రోక్తంగా వేదపండితులతో గృహప్రవేశం చేయించి ఆదివారం గిరిజనులకు అప్పగించారు. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచనలతో మండలంలోని శెట్టిపేట పంచాయతీలోని ఎర్రగానిపల్లెకు చెందిన 3 గిరిజన కుటుంబాలను దత్తత తీసుకున్నారు. గత 4 ఏళ్లగా మొండిగోడలకే పరిమితమైన ముగ్గురి ఇళ్లను పూర్తి చేయించి నూతన దుస్తులు, వంట పాత్రలు, నిత్యావసర వస్తువులు అందించారు.

గ్రామ స్థాయి నుంచి టీడీపీ పటిష్ఠం



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు కందూరి నాగేశ్వర్ నాయుడు

చౌడేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీని గ్రామ స్థాయి నుంచి పటిష్ఠం చేయడం కోసమే నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు అబ్జర్వర్ పాల ఏకరి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కందూరి నాగేశ్వర్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండలంలో జరిగిన గ్రామ కమిటీ ఎన్నికల్లో పుదిపట్ల పంచాయతీ అధ్యక్షుడిగా తేజ, లద్దిగం పంచాయతీ అధ్యక్షురాలిగా సరళ, కొండయ్యగారిపల్లె పంచాయతీ అధ్యక్షురాలిగా ఖాదర్‌బాషా, 29 ఏ చింతమాకులపల్లె పంచాయతీ అధ్యక్షురాలిగా షావలిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కాగతి, కాటిపేరి పంచాయతీల్లో పోటీలు పడగా ఇరువర్గాల కార్యకర్తలతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ పగడాల హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, టీడీపీ నాయకులు గువ్వల రమేష్‌రెడ్డి, మాదిరాజు లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజు, సీనియర్ నాయకులు పార్థసారథి, వినోద్‌కుమార్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, లాయర్ కుమార్ రెడ్డి, బాబునాయుడు, కల్యాణ్, కార్తీక్ పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మ గోశాలకు ఆవు విరాళం



ఆవును విరాళంగా ఇస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు బాబునాయుడు (నాగేశ్వరబాబు)

చౌడేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ గోశాలకు రూ.90 వేలు విలువ చేయు ఆవును అమ్మవారి భక్తుడు విరాళంగా ఇచ్చినట్లు గోశాల ఇన్‌చార్జి సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లె మండలంలో చారాల పంచాయతీ పంజానిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బాబు నాయుడు (నాగేశ్వరబాబు) రూ.90 వేలు విలువ చేయు పాడి ఆవును విరాళంగా అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబురెడ్డి, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఆర్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు



కరపత్రాలు విడుదల చేసిన బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

పుంగనూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయనున్నట్లు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పట్టణంలో గృహ సంపర్క కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ప్రతి ఇంటికి కరపత్రాలను అందించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీశ్‌రాజు, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు త్రిమూర్తిరెడ్డి, చంద్రరాజు, విజయ్, శంకర్, కుమార్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు దాహార్తికి.. కౌండిన్య జలాశయం నీరు

● డిసెంబర్ 1 నుంచి సరఫరాకు చర్యలు



పలమనేరు ఎద్దుల సంత వీధిలోని తాగునీటి శుద్ధి కేంద్ర భవనం

పలమనేరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ప్రజలకు డిసెంబరు 1 నుంచి కౌండిన్య జలాశయం నుంచి తాగునీటి సరఫరాకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మూడేళ్ల క్రితం వర్షాలు ఆశాజనకంగా కురవకపోవడంతో కౌండిన్య నదిపై నిర్మించిన జలాశయం 2024 ఫిబ్రవరిలో ఒట్టిపోయింది. అప్పటి నుంచి పలమనేరు ప్రజలకు కావాల్సిన తాగునీటి కోసం అధికారులు కొత్తగా అక్కడక్కడా బోర్లువేసి డైరెక్టు పంపింగ్ చేయడంతో పాటు వేసవిలో మూడు నెలలపాటు ట్యాంకర్లతో తాగునీటిని తెప్పించి సరఫరా చేస్తూ వచ్చారు. అయితే గత మూడేళ్లుగా వర్షాలు బాగా కురుస్తుండటంతో కౌండిన్య నది జలకళను సంతరించుకొంది. కౌండిన్య నది ఈ ఏడాది అక్టోబరు నెలలో ఉధృతంగా ప్రవహించడంతో పలమనేరు సమీపంలోని కాలువపల్లి వద్ద పలమనేరు ప్రజలకు తాగునీటి కోసం నిర్మించిన కౌండిన్య జలాశయం సైతం నిండి పొంగి పొర్లింది. ఇప్పటికీ రిజర్వాయర్ నీరు కిందకు తరలిపోతోంది. దీంతో అధికారులు కౌండిన్య రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. అయితే దశాబ్దం క్రితం మున్సిపాలిటీ ఏర్పడిన తరువాత రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా ప్రారంభించినప్పుడు ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి కేంద్రాన్ని మళ్లీ తగిన మరమ్మతులు చేపడుతున్నారు. నాణ్యత ప్రమాణాలతో నీటిని శుద్ధి చేసి తాగునీటిని సరఫరా చేసేందుకు దాదాపు రూ.40 లక్షలకు పైగా వెచ్చిస్తున్నారు. నీటి శుద్ధి కేంద్రంలో పనులు పూర్తి కాగానే ప్రజలకు తాగునీటి సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి తెలిపారు. పబ్లిక్ హెల్త్ అధికారులు సైతం ఈ తాగునీటి శుద్ధి కేంద్రం పనులు సత్వరమే పూర్తి చేసేందుకు గుత్తేదారుపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ పనులు వారం రోజుల్లో పూర్తి కానుండటంతో డిసెంబరు 1వ తేదీ నుంచి కౌండిన్య రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. రెండేళ్ల తరువాత పట్టణ ప్రజలు కౌండిన్య రిజర్వాయర్ నుంచి తాగునీటిని వినియోగించుకోనుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



తాగునీటి శుద్ధి కేంద్రంలోని అంతర్భాగాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి

పుంగనూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్మించిన మరుగుదొడ్లను ప్రజలు వినియోగంలోకి తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకులు ఆరోపించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మలమూత్ర విసర్జన బహిరంగ ప్రదేశాల్లో చేయరాదని ఇళ్ల వద్ద మరుదొడ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అయితే గ్రామాల్లో ఇప్పటికీ మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. గత ప్రభుత్వం గ్రామాలల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకు పాలన అన్నారే గాని పరిపాలనలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించి మరుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

వేధింపులపై మహిళ ఫిర్యాదు

పుంగనూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వనమలదిన్నె పంచాయతీ ఓబిరెడ్డిపల్లెకు చెందిన శ్రీరాములు భార్య మల్లిక (29)ను అదే గ్రామానికి చెందిన ఆర్. వెంకటరమణ గత కొంత కాలంగా వేధించడంతో ఆమె ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంకటరమణ భార్య ఉమ, అక్క శాంతమ్మలు తనపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంచె ధ్వంసం చేశారని...

చౌడేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తమ పొలం కంచె రాతి కూసాలు ధ్వంసం చేశారని పరికిదొనకు చెందిన బండారి ప్రకాష్, రమేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని అమినిగుంట పంచాయతీ నూనిముద్దలపల్లె గ్రామం వద్ద ఉన్న యనాదిపాళ్యం సమీపంలో పరికిదొనకు చెందిన రమేష్, ప్రకాష్‌లకు కొంత పొలం ఉంది. పొలం సమీపంలోనే 39 సెంట్ల ప్రభుత్వం భూమికి వేసిన వేసిన రాతి కూసాలను గ్రామస్తులు ఏకమై తొలగించారు. దీంతో ప్రకాష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తీర్థం విద్యార్థినులు



కావేరి, ప్రత్యూష

బైరెడ్డిపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అండర్-17 రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలకు మండలంలోని తీర్థం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కావేరి, ప్రత్యూష ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీపతి తెలిపారు. ఇటీవల బంగారుపాళ్యం మండలం మంగళపల్లెలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరిచి ఎంపికైన వీరు ఈనెల 24, 25 తేదీల్లో విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. విద్యార్థినులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

శబరిమలైకు అయ్యప్ప భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న అయ్యప్పస్వాములు

బైరెడ్డిపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైదుకూరు నుంచి శబరిమలైకు పాదయాత్రగా వెళుతున్న ముగ్గురు అయ్యప్ప భక్తులు ఆదివారం బైరెడ్డిపల్లెకు చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద వారికి శేషాద్రిస్వామి ఆలయ సేవాకర్త ధనంజయగౌడు సాదరస్వాగతం పలికారు. దారి ఖర్చులకుగాను కొంత ఆర్థికసాయం చేసి సాగనంపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



1975-76 బ్యాచ్ విద్యార్థుల గ్రూప్ ఫొటో

సదుం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1975-76 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం కల్లూరు రోడ్డులోని ఎస్‌ఎల్‌వీ ఫంక్షన్ హాలులో కలుసుకున్నారు. అర్ధశతాబ్దం తరువాత వీరి కలయిక అందరిలోనూ భావోద్వేగం రగిలించింది. పరస్పరం కుశల ప్రశ్నలు వేస్తూ గత కాలం నాటి తీపి గుర్తులను గుర్తు చేసుకుంటూ నాటి ముచ్చట్లతో మురిసిపోయారు. 50 ఏళ్ల తరువాత వీరి అపురూప సమ్మేళనం అందరిలోనూ ఆసక్తి, ఆనందం, ఉత్సాహం వెల్లివిరిసింది. బాల్యం నాటి స్నేహం చెరిగిపోని అపురూప జ్ఞాపకం అంటూ వేదికపై పాడిన వెంకట నారాయణ రెడ్డి పాట అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం వీరి వయస్సు 65 ఏళ్లు. అయినప్పటికీ సహచర విద్యార్థుల కోసం సాంకేతిక పరిజ్ఞానంతో వారి చిరునామాలు సేకరించి ఒక వేదికపై కలుసుకోవడం అరుదైనది. బాల్య స్నేహం మరిచిపోలేని మధురానుభూతి అని, తమ నాటి బాల్య విద్యాభ్యాసంలోని తీపి గుర్తులను నెమరు వేసుకున్నారు. అపూర్వ కలయిక కోసం నాటి విద్యార్థుల్లో ప్రొద్దుటూరు కాలేషా, ఉగ్రాణం సీతారామయ్య, వెంకట నారాయణ రెడ్డి, మోహన్ కుమార్, నాగరాజు, రాజశేఖర రెడ్డి ఏర్పాట్లు చేశారు. 65 ఏళ్ల వయస్సులో కలుసుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.

వైకల్య గుర్తింపు శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో పాల్గొన్న ఆర్డీవో భవానీ, ఇతర అధికారులు

సదుం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సదుం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పుంగనూరు నియోజకవర్గ స్థాయిలో ఆదివారం నిర్వహించిన వికలాంగ, వృద్ధులకు అవసరమైన సహాయ పరికాల గుర్తింపు(అలింకో) శిబిరానికి విశేష స్పందన లభించింది. నియోజకవర్గ పరిధిలోని పుంగనూరు మునిసిపాలిటీ రూరల్, చౌడేపల్లె, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల నుంచి 1056 మంది శిబిరానికి హాజరైనట్లు ఎంపీడీవో రాధారాణి తెలిపారు. హాజరైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సహాయ పరికరాలు అవసరమైన వారిని గుర్తించి త్వరలో సంబంధిత పరికరాలు ప్రభుత్వం ద్వారా అందజేస్తారని ఆమె తెలిపారు. వారికి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థులు సేవలందించారు. హాజరైన వారందరికీ భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథ్ గౌడ్, పలమనేరు ఆర్డీవో భవానీ, తహసీల్దారు ప్రమీల, సదుం ఎస్ఐ షేక్ షావలి, సాంఘిక సంక్షేమ అధికారులు విక్రమ్ కుమార్ రెడ్డి, శ్రీరాములు నాయక్, వైద్యులు సతీశ్ పట్నాయక్, రాజు బాబు, గోపాల్, డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షులు రెడ్డిప్రసాద్ రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా జూనియర్ కళాశాల భవనాలు

● అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం
● పట్టించుకోని అధికారులు, పాలకులు



గుడుపల్లె పాత జూనియర్ కళాశాల భవనం

గుడుపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు నిరుపయోగంగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. 2002 సంవత్సరంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల మంజూరు చేసింది. పది తరగతి గదులతో సంగనపల్లె రోడ్డులో కళాశాలను నిర్మించారు. కళాశాలలో 6 గ్రూప్‌లు ఉండటంతో తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. అధ్యాపకులు కళాశాల ఆరు బయట, చెట్ల కింద విద్యార్థులకు బోధించేవారు. వర్షాకాలంలో నిత్యం ఇబ్బందులు పడేవారు. దీంతో విద్యార్థులు తరగతి గదుల కోసం రోడ్డెక్కి నిత్యం ధర్నాలు చేయడంతో స్పందించిన అప్పటి టీడీపీ ప్రభుత్వం జూనియర్ కళాశాలకు సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో 2017లో 30 తరగతి గదులతో కొత్త జూనియర్ కళాశాల భవనాన్ని నిర్మించింది. ఆ తరువాత కొత్త భవనానికి కళాశాల మారింది. అప్పటి నుంచి పాత జూనియర్ కళాశాల భవనాలు నిరుపయోగంగా మారాయి. అప్పటి నుంచి కళాశాల భవనాలు ఆకతాయిలకు అడ్డాగా, మందు బాబులకు నిలయంగా మారింది. చీకటిపడితే అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ భవనంలోని కొన్ని తరగతి గదులకు ఏర్పాటు చేసిన తలుపులను, కిటికీలు దొంగలు చోరీ చేసుకెళ్లారు. గదుల లోపల బయట ఎటు చూసినా మందుబాబులు తాగి పడేసిన లిక్కర్ సీసాలే దర్శనమిస్తున్నాయి. ఈ భవనాలకు కొంత దూరంలో జడ్పీ ఉన్నత పాఠశాల సైతం ఉంది. ఇక్కడ 600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ పాఠశాలలో విద్యార్థులకు గదులు చాలక చెట్ల కిందనే చదువులు కొనసాగిస్తూ నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. నిరుపయోగంగా ఉన్న కళాశాల భవనాలు వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు అధికారులు, నాయకుల దృష్టికి కొన్నేళ్లుగా తీసుకెళ్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన భవనాలను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



భవనం లోపల తాగి పడేసిన మద్యం సీసాలు

బస్ షెల్టర్ నిర్మించండి ప్లీజ్



బస్ షెల్టర్ లేక రోడ్డుపై ఉన్న విద్యార్థులు

పాలసముద్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పురెడ్డికండ్రిగ (కేఆర్.కండ్రిగ) వద్ద బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతునానారు. గ్రామం నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్డుపై వేచి ఉంటారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బంది పడుతున్నారు. వేసవిలోనూ ఎండకు ఎండాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ బస్సు షెల్టర్ నిర్మించాలని ప్రభుత్వ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఘనంగా ఎన్‌సీసీ డే



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

గుడిపాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఎన్ఆర్ కళాశాలలో 79వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం కళాశాలలో ఎన్‌సీసీ డే సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ మేరకు కళాశాల వ్యవస్థాపకుడు లోకేష్, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ అధికారి అర్జున్ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలన్నారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ రామచంద్ర పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గో సంరక్షణ ట్రస్టుకు లక్ష విరాళం



విరాళదాతకు జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ కోదండపాణి

ఐరాల (కాణిపాకం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోసంరక్ష ట్రస్టుకు గుంటూరుకు చెందిన టి.భాస్కరరావు ఆదివారం రూ.1,00,020 విరాళంగా అందించారు. దాతను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం దాతను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద బాలశిక్ష పుస్తకాల ఆవిష్కరణ



శ్రీరంగరాజపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్పందన ఫౌండేషన్ నిర్వాహకురాలు శ్యామలాదేవి స్మారకార్థం 1984-1985 49. కొత్తపల్లె మిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి పూర్వ విద్యార్థుల బృందం ముద్రించిన పెద్దబాలశిక్ష పుస్తకాలను ఆదివారం గంగమ్మ గుడిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్య క్షులు పి.తులసినాథం నాయుడు మాట్లాడుతూ జ్ఞానానికి మించిన సంపద లేదన్నారు. శ్యామలదేవి చనిపోయే వరకు జ్ఞానాన్ని పంచారన్నారు. ఆమె పేరు మీద పుస్తకాలు ముద్రించి పంచిపెట్టడం సంతోషంగా ఉందని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ఉదయశ్రీ, గిరిధర్, జలంధర్, విద్యార్థులు హరిప్రసాద్, రామచంద్ర, జ్యోతి ప్రసాద్, సాహిత్యవేత్తలు హరినాయుడు, రమేష్ నాయుడు, అన్నయ్య, పుష్ప పాల్గొన్నారు.

రెండు నెలలుగా రోడ్డుపైనే వర్షపునీరు, డ్రైనేజీ నీరు

● ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు



సంతపేట ఇందిరానగర్‌లో నడిరోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు, వర్షపు నీరు

చిత్తూరు అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా అప్పుడప్పుడూ కురుస్తున్న వర్షపు నీరు చిత్తూరు - అరగొండ రోడ్డులోని ఇందిరానగర్ ప్రధాన రహదారిలో డ్రైనేజీ, వర్షపు నీరుపోయేందుకు సరైన దారిలేక రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఈ కారణంగా తారురోడ్డు పాచిపట్టి, గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షానికి సైతం గుంతల్లో నీరు చేరిపోయి, రోడ్డుపై వెళ్లే వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. ఈ రోడ్డుపై ద్విచక్రవాహనంలో వెళ్లేవారు కచ్చితంగా పడిలేచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల నగరపాలక అధికారులు ఇందిరానగర్, సంతపేటప్రాంతాల్లో కాలువపై ఉన్న కట్టడాలను కూల్చి తాత్కాలిక ఉపశమనం కల్పించారు. తేనబండ, మంగసముద్రం ప్రాంతాల కాలువలపై నిర్మాణాలు చేపట్టడం, సప్లై ఛానళ్లు మూసివేయడంతో రోడ్డుపైనే నీరు ప్రవహిస్తోంది. దీనిపై నగరపాలక, ఇరిగేషన్, రెవిన్యూశాఖ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబుకు సన్మానం



విజయపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చిన్న తరహా పరిశ్రమల డైరెక్టరు (ఎంఎస్ఎంఈ) చినబాబును ఆదివారం మండలంలోని క్షురికాపురానికి చెందిన మాజీ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు గజేంద్ర శాలువాతో సత్కరించారు. ఆయనకు మరిన్ని పదవులు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, నాయకులు బాలాజీ, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చండి సారూ..!



విజయపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సార్ మారోడ్డుకు మోక్షం కల్పించండి అంటూ మండలంలోని ముత్యాలరెడ్డి, మంగళం వాసులు కోరుతున్నారు. మంగళం చెరువు కట్టపై ఉన్న తారురోడ్డు గుంతలమయంగా ఉండడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు బాగుచేయాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

నగరి సీఐ బాధ్యతల స్వీకరణ



నగరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరి సీఐగా మల్లి కార్జున్‌రావు ఆదివారం బాధ్య తలు స్వీకరించారు. గతంలో సీఐగా పని చేసిన విక్రమ్ తిరుపతి స్పెషల్‌బ్రాంచికి బదిలీ కావడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వరసిద్ధుడిని దర్శించుకున్న కూర్మనాథ్



ఐరాల(కాణిపాకం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ సర్వేయర్ డిపార్టుమెంట్ కమిషనర్ రోణంకి కూర్మనాథ్ ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను అధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామివారి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి దర్శనార్థం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి

రూ.6 లక్షల మంజూరు



చెన్నైలో చికిత్స పొందుతున్న గంగాధర్‌బాబు

నగరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపల్ పరిధిలోని నెత్తంకండ్రిగకు చెందిన గంగాధర్‌బాబుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.ఆరు లక్షలు మంజూరు చేయించారు. చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయనకు ఈ రూ.6లక్షలను నేరుగా వైద్యశాలకు అందేలా ఆయన చర్యలు తీసుకున్నారు.

బోయకొండ గోశాలకు ఆవు విరాళం

చౌడేపల్లె, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోయకొండ గంగమ్మ గోశాలకు చౌడేపల్లె మండలం చారాల పంచాయతీ పంజానిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బాబు నాయుడు (నాగేశ్వరబాబు) రూ.90 వేలు విలువ చేసే ఆవును విరాళంగా అమ్మవారికి సమర్పించారు.

ఐటీఐకి సొంతభవనం కలేనా..!

2008లో ప్రాథమిక పాఠశాలలో తాత్కాలిక తరగతులు ● నేటికీ అవే తరగతుల్లోనే నిర్వహణ ● ప్రస్తుతం శిథిలావస్థలో ఆ గదులు ● అర్ధాంతరంగా ఆగిన సొంత భవన నిర్మాణ పనులు ● భయం గుప్పిట్లో వెదురుకుప్పం ఐటీఐ విద్యార్థులు ● పట్టించుకోని పాలకులు







అర్ధాంతరంగా ఆగిపోయిన ఐటీఐ సొంత భవన నిర్మాణ పనులు - ఐటీఐ కొనసాగుతున్న శిథిల భవనం - ఐటీఐ తరగతి గదుల నిర్వహణ

వెదురుకుప్పం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఐటీఐ విద్యార్థుల 'వేదన' ఎవరూ పట్టించుకోవడం లేదు. భవన నిర్మాణ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే నారాయణ స్వామికి డిప్యూటీ సీఎం హోదా దక్కింది. అయినా వెదురుకుప్పం ఐటీఐ విద్యార్థులకు భవన వసతి కలగా మారింది. ఇప్పటికీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాల్లోని శిథిల భవనంలోనే ఐటీఐ కొనసాగుతోంది.

ముద్దుకృష్ణమ చొరవతోనే ఐటీఐ

అప్పటి పుత్తూరు ఎమ్మెల్యే గాలి ముద్దుకృష్ణమనాయుడు చొరవతో 22-10-2008న వెదురుకుప్పంలో ఐటీఐ మంజూరు చేశారు. అప్పట్లో తాత్కాలికంగా వెదురుకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తరగతులు ప్రారంభించారు. ఆ తర్వాత సొంత భవన నిర్మాణాల కోసం ఏపీ స్టేట్ గవర్నమెంటు రూ.3కోట్లను కేటాయించింది. దీంతో భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే నిధుల కొరత కారణంగా పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అప్పటి నుంచి ఆ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి.

ఐటీఐ పరిస్థితి ఇలా...

ఇక్కడి ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఫిట్టర్, కోపా, డ్రస్స్ మేకింగ్, మెకానిక్ డీజిల్ కోర్సులు ఉన్నాయి. ఈ ట్రేడ్లలో 245 మంది విద్యార్థులు ఉన్నారు. సొంత భవన వసతి లేక వెదురుకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహిస్తున్నారు. ఆరు ట్రేడ్లు ఉన్న కారణంగా తరగతి గదులు సరిపడక ఇబ్బందులు తప్పడం లేదు. శిథిల భవనంలోనే తరగతులు సాగుతున్నాయి. భవన పైకప్పు పెచ్చులూడుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సొంత భవన వసతి అవసరం



ఐటీఐకి సొంత భవన భవన వసతి అవసరం. అప్పట్లో ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లో తాత్కాలికంగా ప్రారంభించారు. అయితే ఇప్పటికీ అందులోనే కొనసాగు తోంది. ప్రభుత్వం స్పందించి ఐటీఐకి సొంత భవన వసతి కల్పించాలి.

-సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్, వెదురుకుప్పం ఐటీఐ

విశ్వశాంతికి సత్యసాయి బోధనలు స్ఫూర్తి



సత్యసాయిబాబాకు నివాళులు అర్పిస్తున్న తహశీల్దార్, భక్తులు

బంగారుపాళ్యం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం సత్య సాయి బాబా బోధనలే స్ఫూర్తి అని తహసీల్దార్ షబ్బీర్ బాషా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సత్యసాయి సేవా ట్రస్టు ఆధ ర్యంలో సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో తహసీల్దార్ షబ్బీర్ బాషా, ఎంపీడీవో మహేష్, అధికారులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా మార్గాల్లో ప్రజలు నడిస్తే ప్రపంచం సుఖసంతోషాలతో విరాజిల్లుతుందని అన్నారు. అనం తరం మండల కేంద్రంలోని బీసీ వసతి గృహంలో విద్యార్థులతో కలిసి సత్యసాయి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యా ర్థులు తమకు దుప్పట్లు, చాపలు లేవని, పడుకోవడానికి కష్టంగా ఉందని చిరిగిపోయిన దుప్పట్లను అధికారులకు చూపారు. త్వరలోనే దుప్పట్లు, చాపలు అందజేస్తానని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో సత్య సాయి సేవా ట్రస్టు సభ్యులు రోహిణి, డీటీ బాబు, వీఆర్వోలు, విశ్రాంత ఉపాధ్యాయులు గురునాథం, చంద్రశేఖర్ పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటి ప్రవాహంతో ఇక్కట్లు



జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

బంగారుపాళ్యం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండంల కేంద్రంలోని ఆండారెడ్డిపల్లె వద్ద జాతీయ రహదారిపై మురుగునీరు ప్రవహిస్తోంది. ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇందిరమ్మ కాలనీ, ఆది ఆంధ్ర వాడ నుంచి వచ్చే మురుగునీరు వెళ్లడానికి కాలువ లేకపోవడంతో రోడ్డు పైనే కొన్నేళ్లుగా మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. చిత్తూరు -పలమనేరు వైపు వెళ్లే వాహనాలు వెళ్లే సమయంలో పాదచారులపై, ద్విచక్ర వాహనదారులపై మురుగునీరు పడుతోంది. గతంలో పెద్ద గోతుల వలన ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం. ప్రస్తుతం అది పూడ్చివేసినా ఈ వర్షాల కారణంగా మళ్లీ గుంతలు పడ్డాయి. అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై ప్రవహించకుండా కట్టడి చేసి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని పలువురు కోరుతున్నారు.

విరూపాక్షమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



విరుపాక్షమ్మ ఆలయానికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న టీడీపీ నేత, ఎన్ఆర్ఐ ఊట్ల శ్యామసుందర్ రావు

పూతలపట్టు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుకనుమ దళితవాడలో కొలువైన విరుపాక్షమ్మ ఆలయ అభివృద్ధికి టీడీపీ ఎన్ఆర్ఐ నేత ఊట్ల శ్యామసుందర్ రావు రూ.50 వేలు విరాళంగా అందించారు. ఆదివారం రాత్రి ఆయన దళితవాడలోని అమ్మవారి ఆలయం వద్దకు తమ కుటుంబసభ్యులతో విచ్చేసి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధిపై గ్రామస్తులతో చర్చించారు. ఆలయ అభివృద్ధి కోసం రూ.50 వేలు నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాణిపాక వినాయకస్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు ఊట్ల నాగరాజు నాయుడు, టీడీపీ నేత హేమాద్రినాయుడు, సుబ్బరాజులు, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాల్లో చిత్తూరు



డీఈవో కార్యాలయం ఎదుట తిరగలేక ఇబ్బంది పడుతున్న పాల లారీ



చర్చి వీధిలో ఆటోల కారణంగా నిలిచిన వాహనాలు

చిత్తూరు రూరల్ నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పట్లేదు. ట్రాఫిక్ రూల్స్ కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎంఎస్ఆర్ సర్కిల్లో ఏదైనా వాహనాలు అది పెద్దదైనా, చిన్నదైనా వేలూరు రోడ్డు నుంచి హైరోడ్డుకు చేరుకోవాలంటే డీఈవో కార్యాలయం వరకు వెళ్లి అక్కడ యూ టర్న్ తిరగాల్సిందే. దీంతో హైరోడ్డు నుంచి పలమనేరు రోడ్డు మీదుగా ప్రయాణించే వాహనాలు, వేలూరు రోడ్డు నుంచి హైరోడ్డుకు వచ్చే వాహనాలు డీఈవో కార్యాలయం ఎదురుగా యూ టర్న్ తీసుకోవాల్సి వుంది. దీంతో లారీలు, పెద్ద వాహనాలు తిరగలేక ఇబ్బందులు పడుతున్నాయి. ఈ కారణంగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇటీవల ఓ పెద్ద పాల లారీ వేలూరు నుంచి చిత్తూరు హైరోడ్డుకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ స్తంభించింది. అలాగే చర్చీ వీధిలో ఆటోల రద్దీ కారాణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 108 కూడా అనేకసార్లు ఈ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. ట్రాఫిక్ పోలీసులు చర్చీవీధి ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర వాసులు కోరుతున్నారు.

మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



ముత్తయ్యను సన్మానిస్తున్న నాయకులు

నగరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మొదలియార్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన ఎన్.టి.ముత్తయ్యకరుణను నగరి టీడీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుణశేఖర్, పట్టణ కార్యదర్శి శ్రీనివాసం, నాయకులు జ్యోతి నాయుడు, వెంకటేశులు, నూరుల్లా, అల్లిముత్తు, కన్నయ్య, మధువనం, శ్రీధర్, సలీం, కరీం పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



నగరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని షిరిడీ సాయి సేవా కేంద్రం కన్వీనర్ లాయర్ మురళీధర్ దివ్యాంగులకు టీఆర్ కండ్రిగ వద్ద శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలో అన్నదానం చేశారు. అలాగే దివ్యాంగులకు అవసరమైన సబ్బులు, పేస్టులు అందించారు. ఈ కార్యక్రమంలో షిరిడీసాయి సేవా కేంద్రం సభ్యులు, శిరీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబాకు అంజలి

వెదురుకుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం కార్వేటి నగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద బాబా చిత్రపటానికి తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ నరసింహులు పుష్పాంజలి ఘటిం చారు.

చెకుముకిలో ప్రతిభకు అభినందనలు



వెదురుకుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభకనపరచిన విద్యార్థులకు కార్వేటినగరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం శేఖర్, జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ వేణు గోపాల్ అభినందనలు తెలిపారు.

వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తున్న టీడీపీ నాయకుడు దామోదరరెడ్డి

వెదురుకుప్పం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు పంచాయతీలోని గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు టీడీపీ నాయకులు సర్పంచ్ కె.నవనీతమ్మ, దామోదరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మనోహర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హిమగిరి, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

వర్షాలతో ప్రమాదకరంగా మారిన రహదారులు

శ్రీరంగరాజపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అసలే వర్షాలు, ఆపై గుంతలు పడ్డ రహదారులు. జనం, వాహనదారుల అవస్థలు అన్నీఇన్నీ కావు. ఎస్ఆర్‌పురం మండలంలో మంగుంట నుంచి ఆళ్లమడుగు రోడ్డు గుంతల మయమైయింది. 49.కొత్తపల్లెమిట్ట నుంచి వెళ్లే చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ఎస్ఆర్‌పురం నుంచి పుల్లూరు వెళ్లే తారురోడ్ల కుంటను తలపిస్తోంది. దెబ్బతిన్న రోడ్లు బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.







అధ్వానంగా ఉన్న మంగుంట తారు రోడ్డు - చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై గుంతలమయమైన రోడ్డు - గుంతలో నిల్చి ఉన్న వర్షపు నీరు